

సాధారణ
దీపావళి కథల పోటీలో
రెండవ బహుమతి
పొందినది

తెలతెలవారుతున్న అలికిడికి కృష్ణవేణమ్మ నిద్ర లేచింది. మామూలుగా తెల్లవారుజామునే లేచి ఆమె ఎంతో ఉత్సాహంతో పనిపాటలు చేసుకునేది. కాని ఆ రోజు ఆమెకి మంచం మీదనించి లేవ బుద్ధి పుట్ట లేదు. మసక చీకటి చూస్తుంటే వయసు బలవంతాన మీద పడి తన నల్లటి నిడుపాటి వెంట్రుకలు అప్పుడే నెరిసిపోతున్నట్టుగా ఉంది. వరండా లోంచి ఆకాశం వెలిసిపోయిన నల్లటి వస్త్రంలా ఉంది. ఆమె దిగులుగా రవీంద్ర వైపు చూసింది. నిద్రలో అతను పక్కకి కదిలాడు. నిద్రలో కూడా ఆ వదనంలో ఏదో నిస్పృహ. ఎన్నేళ్ళు చేసినా ఆ గుమాస్తా ఉద్యోగం నించి మోక్షం లేదు. జీవితంలో తమ కేమీ చెప్పుకోదగ్గది లభించకపోయినా ఒకే ఆశ మినుకు మినుకు మంటూ వెలుగుతూంది. కాని, ఈ గోపీ —

గోపీ దగ్గాడు.

'చిరంజీవ' అనుకుంది కృష్ణవేణమ్మ.

నిద్రలోనే దిండు కింద తడిమి సిగరెట్ పెట్టె తీసి, బలవంతాన కళ్ళు సగం తెరిచి, సిగరెట్ తీసి ముట్టించాడు గోపీ.

కృష్ణవేణమ్మ మనస్సు చివుక్కుమంది. మొదట మొదట చాటుగా సిగరెట్లు తాగేవాడు. ఒకసారి బయట పడేసరికి ఆ బెరుకు కూడా పోయింది. పైగా "సిగరెట్ తాగకపోతే, మెదడు చురుకుగా ఉండదు, చదువు సాగదు, నే నేం ఫాషన్‌కోసం తాగడం లేదు. కష్టపడి చదివి మెడిసిన్‌లో సీటు సంపాదించుకోవాలని మీరేగా పోరు

# కృష్ణవేణి తల్లడిల్లింది

'హితశ్రీ'



పెట్టేది?" అంటాడు.

గోపీ మళ్లీ దగ్గాడు. 'శతాయుష్షు.'

పాడు దగ్గు. చదువు సంగతి ఎలా ఉన్నా ఈ సిగరెట్ల వల్ల దగ్గు ఒకటి పట్టుకుంది. మనసు ఉండబట్టక కృష్ణవేణమ్మ గోపీ మంచం దగ్గిర కెళ్లి అతని గుండె నిమిరింది.

"దగ్గు వస్తోంది, బాబూ, సిగరెట్లు తాగటం తగ్గించకూడదూ?"

"ఊఁ" అంటూనే మళ్లీ దగ్గాడు గోపీ.

"చిరంజీవ" అంది కృష్ణవేణమ్మ. మరి కాసేపటికే "శతాయుష్షు" అనక తప్పలేదు.

"తుమ్ము తుమ్ముకే కాక దగ్గు దగ్గుకీ కూడా నువ్వు 'చిరంజీవ, శతాయుష్షు' అంటుంటే ఇరవై ఏళ్లకే నేను ఢామ్మని చస్తాను" అన్నాడు

**కన్నబిడ్డ కాలిలో ముల్లు గుండెలో ములుకై బాధిస్తుంది తల్లిని. జన్మ ఇవ్వడమే కాదు, సర్వకాల సర్వావస్థలలోనూ బిడ్డ క్షేమాన్నే కోరి అందుకోసం ప్రాణాన్ని సైతం చిరునవ్వుతో అర్పించగల శక్తి తల్లికి మాత్రమే ఉంది. తాను ఇహలోకం విడిచిపోయిన తరవాత కూడా బిడ్డకు శ్రీరామరక్షగా నిలవాలని కోరేది మాతృ హృదయమే!**

గోపీ చిరాగ్గా.

కృష్ణవేణమ్మ తెల్లబోయింది. వొగ్గినప్పుడల్లా తన గుండె ఎలా కొట్టుకుంటుందో వాడికేం తెలుసు?

"ఛీ. అదేమిటి, బాబూ, తెల్లవారగట్లా అశుభం మాటలు!"

"మరి లేకపోతే ఏమిటి, పొద్దున్నే కాసేపు నిద్రపోనీయకుండా?"

"అన్నానని కోపం తెచ్చుకోకు, గోపీ. నిద్రలోనే సగం జీవితం గడిచిపోతుంది. నాలాంటి వాళ్ళకి అదే సుఖం. కాని నువ్వు జీవితంలో పైకి రావాలనీ, ఎంతో కీర్తి ప్రతిష్ఠలు సంపాదించాలనీ, సుఖపడాలనీ రోజూ దేవుడికి ఎన్నిసార్లు మొక్కుకుంటానో! నాన్న చూడు. అష్టకష్టాలూ పడి, శక్తికి మించిన చాకిరి చెయ్యటం దేనికి? నిన్ను డాక్టరు పరీక్ష చదివించాలని కదూ?"

"సరే, ఇప్పు డేమైంది?"

"ఏమైందో నీకు తెలియదూ? నీ ప్రవర్తన బాగాలేదని, ఈ వేళ తనని కలుసుకోవలసిందని మీ ప్రిన్సిపాలుగారు నాన్నకి ఉత్తరం రాశారు."

"రాస్తాడు, రాయడూ, ప్రిన్సిపాలుకి పనేముంది? లెక్చరర్లు ఎలా ఆడిస్తే అలా ఆడతాడు. ఒట్టి ఇనెఫిషియంట్—"

"ఆయన్ని ఆడిపోసుకుంటావేం రా? నీ బుద్ధి మంచిదైతే ఒకరు నీ జోలి కెందు కొస్తారు? కిందటేడాది లాయర్గారి అమ్మాయిని అల్లరి చేశావని డిస్మిస్ చేసినంత పని చేశారు గదా! ఎంత అప్రతిష్ఠ! మళ్ళీ ఈ సంవత్సరం ఏం చేశావో —"

"నేను యూనియన్ కార్యదర్శినని ప్రిన్సిపాలుకీ, లెక్చరర్లకీ కంటగింపు. ఏదో కారణం వెతికి నన్ను సాధించాలని చూస్తున్నారు. అంతే."

"యూనియన్ కార్యదర్శి అయితే అవిధేయుడివిగా ఉండాలా?"

"అవిధేయత, అవిధేయత! నీకేం తెలుసు విద్యార్థి సమస్యలు, విద్యార్థి మనస్తత్త్వం? ఏదైనా గట్టిగా అడిగితే అవిధేయత కిందే జమ. సమ్మె చేస్తే సరేసరి. నేను లీడర్ని. నే నంటే అందరూ బ్రహ్మరథం పడతారు. నీకేం తెలుసు నా సంగతి? చూస్తూ ఉండు. బ్రహ్మాండ నాయకుడినై పోతాను."

"పిచ్చివాడా! ఇలాంటి గొప్పలు ముందు ఉద్ధరించవు. కిందటేడు ట్యూషన్ పెట్టినా పి. యు. సి. లో క్లాసు రాలేదు. ఖర్చుకి చూడకుండా మళ్ళీ ఈ సంవత్సరం చదివిస్తున్నాం. మంచి మార్కులు తెచ్చుకొని మెడిసిన్లో సీటు తెచ్చుకో, నాన్నా. నువ్వు డాక్టరువి కావాలన్నదే నా ఒకే ఒక్క కోరిక."

గోపీ మాట్లాడలేదు. అతని దగ్గిర్నించి ప్రోత్సాహకరమైన జవాబు రాకపోయేసరికి కృష్ణవేణమ్మ నిరుత్సాహ పడింది.

"నిన్న ప్రిన్సిపాలుగారి ఉత్తరం చూసినప్పటి నించీ నాన్నకి ఆందోళనగా ఉంది. నాన్న మనసు నీకు తెలుసుగా? ఏమంటే ఏం నొచ్చుకుంటావో నని ఆయన ఎదటబడి నిన్ను ఒక్క మందలింపు మాటన్నా అనరు. నువ్వు అది గ్రహించాలి."

గోపీకి విసుగు ఎక్కువైంది.

"అవును. మీ రందరూ నా మంచి కోరే వారు. నేను మాత్రం వట్టి దౌర్భాగ్యుణ్ణి. దుర్మార్గుణ్ణి. అంతేగా! సరే, అలాగే అనుకోండి. నా ఖర్మ."

అతని వైఖరికి కృష్ణవేణమ్మ గాభరా పడింది.

"అది కాదు, బాబూ. నీ కెలా చెప్పాలో తెలీటం లేదు. మొన్న బార్లో నిన్ను చూశానని మన శాస్త్రిగారబ్బాయి చెప్పాడు —"

గోపీ చివరుగా తటాలున లేచాడు.

"అవును. మీ రిచ్చే పదులూ, ఇరవైలూ ఎలా ఖర్చు పెట్టాలో తెలీక కొట్టుకుంటున్నాను కదూ? బార్కి వెడతాను, మరి వెళ్ళనూ—"

గోపీ చప్పున మంచం మీంచి లేచాడు. లోపల అతనికి బెరుగ్గానే ఉంది. 'ఈ సి. ఐ. డి. పని చేసేవాళ్ళకి బుద్ధిలేదు! ఆ శాస్త్రిగారబ్బాయి సంగతేమిటో చూడాలి. తను యూనియన్ కార్యదర్శి. ఎవరో ఏదో బలవంతం చేస్తుంటారు. ఎలా కాదంటాడు? "సోషల్"గా లేకపోతే ఎలా పైకొస్తాడు? అయినా మొన్న కొంచెం పొరపాటే జరిగింది. కాస్త మరుకు ఎక్కువై లెక్చరర్తో పేచీ పెట్టుకొన్నాడు. ఆయన ప్రిన్సిపాల్కి రిపోర్టిచ్చాడు. ఈవేళ బెదిరిస్తాడు కాబోలు. సస్పెండు చేస్తాడేమో!'

అతని ధోరణికి కృష్ణవేణమ్మ మరింత దిగులుపడి పోయింది. నెమ్మది మీద నచ్చచెప్పాలని తీర్మానించుకుంది.

"సరేలే. త్వరగా ముఖం కడుక్కో, బాబూ, కాఫీ ఇస్తాను."

ఆమె లోపలికి వెళ్ళిపోయింది.

గోపీ ముఖం కడుక్కుంటున్నాడే కాని అతని మనసు వికలమైంది. ఒక విధంగా తను బాధ్యత విస్మరిస్తున్నా డేమో ననిపించింది. తను బొత్తిగా చదవకపోవడం లేదు. కాని మనసు నిలవటం లేదు. చీటికీమాటికీ విద్యార్థి సమస్యలు తలెత్తుతున్నాయి. తను కావాలని కొన్నిటిని నెత్తిమీద వేసుకున్నాడు. కార్యదర్శి హోదా ఉండటం వల్ల లెక్చరర్ల దగ్గిర ప్రత్యేకమైన అంతస్తుతో మాట్లాడతాడు. వాళ్ళ కది కిట్టదు. ఏదో మాటా మాటా వస్తుంటది. గందరగోళం జరుగుతుంది విద్యార్థులకి తను ఓ హీరో. అందులో ఏదో నిషా ఉంది. సమ్మెల్లో పాల్గొన్నప్పుడల్లా ఆకాశాని కెలా ఎత్తేస్తారు!

"ఇదిగో, బాబూ, కాఫీ."

కాఫీకప్పుతో ప్రత్యక్షమైన అమ్మని చూసేసరికి ఆమె పట్ల ఎంతో జాలి కలిగింది. అమ్మకి కష్టం కలిగించ కూడదు. కొడి దులిపిన దీపంలా తను చదువులో ప్రవేశించాలి.

చప్పున ముఖం కడగటం ముగించి కాఫీ కప్పు అందుకుని ఓ గుటక వేశాడు గోపీ. కొరబోయింది. తలమీద చెయ్యి పెట్టి అదిమి కృష్ణవేణమ్మ—"పొద్దున్నే ఎవరు తలుచుకుంటున్నారో పిచ్చి తండ్రిని!" అంది.

"తలుచుకునే వాళ్ళకేం కొదవ?" అన్నాడు గోపీ.

"మా ఆవేదన అంతా అందరూ నిన్ను మంచిగా తలుచుకోవాలనే, బాబూ. పెద్ద డాక్టరై బీదా బిక్కీని ఆదుకోవాలి. చెల్లెలి పెళ్ళి ఘనంగా జరిపించాలి. ఫలానా రవీంద్రగారి అబ్బాయని నలుగురూ గొప్పగా చెప్పుకోవాలి. నీ మీద ఎంత ఆశలు పెట్టుకున్నామో నీకు తెలియదు, బాబూ. మే మేదో బావుకోవాలని కాదు. మాకు నువ్వు పోసే తులసినీళ్ళే మందునీళ్ళు. కాని నీ కర్థం కాదు, నాయనా..."

"సరే, సరే, సరే!" అన్నాడు గోపీ. కాని వెంటనే బాధపడ్డాడు. తనలో



దీప పంక్తి చిత్రం — మండల్ రెడ్డి కృష్ణారెడ్డి

ఏదో కరుకుతనం కొత్తగా వస్తూంది. తల్లివైపు చూశాడు. ఆమె కళ్లలో నీళ్లు తిరిగాయి. "సరేలే, అమ్మా" అన్నాడు కొంచెం మృదువుగా.

కృష్ణవేణమ్మ ఇక మాట్లాడకుండా వెళ్లిపోయింది.

కాలేజీ గేటు దాటి లోపలికి పోగానే గోపీని ఏదో ఆవేశిస్తుంది. ఆ రోజూ అలాగే జరిగింది. జువాలజీ లెక్చరర్ క్లాస్ జరుగుతూంది. గోపీ పక్క విద్యార్థితో ఏదో మాట్లాడుతున్నాడు. లెక్చరర్ కళ్లతో రెండు మూడు సార్లు వార్నింగ్ ఇచ్చాడు. ప్రయోజనం లేక పోయింది.

"మిస్టర్ గోపీ!"

"సార్!" నిలబడ్డాడు గోపీ.

"మలేరియా ఎందుకు వస్తుంది?"

"దోమ కాటువల్ల."

"ఏ దోమ?"

"మలేరియా దోమ." విద్యార్థులు గొల్లు మన్నారు.

"స్టుపిడ్."

"హూ?"

"యూ."

"యూ?" బెంచీలు దబదబా బాదారు విద్యార్థులు.

"షటప్!"

"షటప్ వాట్?"

"గెటౌట్!" అరిచాడు లెక్చరర్.

పరిస్థితి విషమించింది. ఆమకోకుండానే తలతిక్కగా మాట్లాడాడు. ఆడపిల్లలు నవ్వుతున్నారు. విద్యార్థి యూనియన్ కార్యదర్శిని గెటౌట్ అంటాడా! ఒళ్లు మరిచాడు గోపీ.

"యూ గెటౌట్!" అన్నాడు తీవ్రంగా గోపీ.


"క్లాస్ [illegible] చేశావు. ప్రిన్సిపాల్‌తో సంజాయిషీ చెప్పుకో, మిస్టర్ గోపీ. ఐ సస్పెండ్ యూ."

"హూ ఆర్ యూ టు సస్పెండ్ మీ?" అన్నాడు గోపీ ధిక్కారస్వరంతో.

లెక్చరర్ క్లాస్ బయటికి వచ్చాడు. "బ్రహ్మాండం" అన్నారు విద్యార్థుల్లో కొందరు. మరికొందరు షేక్‌హాండిచ్చారు. "స్టూడెంట్స్ పరువు నిలబెట్టావు, బ్రదర్" అని మెచ్చుకున్నారు మరికొందరు. ఇంకా కొందరు అంతరంగికులు "ప్రిన్సిపాల్ దాకా పోతే మక్కలిరగతంతాం అని బెదిరిద్దాం, పద" అన్నారు. గోపీ యాంత్రికంగా వాళ్ల ననుసరించాడు.

అందరూ కలిసి ప్రిన్సిపాల్ దగ్గిరకి వెడుతున్న జువాలజీ లెక్చరర్ని అటకాయించారు. ఇంతకి ముందు గోపీ ఎన్నడూ దుర్భాషలాడి ఎరగడు. కాని ఆ రోజు అతన్ని దురాగ్రహం ఆవేశించింది. ఈ లెక్చరరే మొన్న ప్రిన్సిపాల్‌తో రిపోర్టిచ్చాడు. ఈ వేళ సన్నివేశం ప్రిన్సిపాల్ చెవిని పడితే డిస్‌మిస్ చేసేస్తాడు. ఏదో భయం పట్టుకుంది. దానివల్ల మరింత తెగింపు కలిగింది. లెక్చరర్ కాలర్ పట్టుకున్నాడు. తనని డిస్‌మిస్ చేయిస్తే ఆ రాత్రికే ఆ మనిషి గల్లంతు అవుతాడని శపథం చేశాడు. లెక్చరర్ కళ్లు ఎర్రబడ్డాయి. మరో సారి "జాగ్రత్త" అని ఆయనని వదిలారు.

"పిరికిపంద — ఏం చేస్తాడులేరా, డోంట్ బీ ఎఫ్రయిడ్" అన్నారు మిత్రబృందం.



దీప కన్య చిత్రం — మండల్ రెడ్డి కృష్ణా రెడ్డి

"ఏమన్నా చేస్తే నా తడాఖా చూపించనూ?" అన్నాడు గోపీ.

అయితే మరో పావు గంటలోనే పోలీస్ వాన్ కాలేజీ గేట్ ముందు ఆగటం, సబిన్‌స్పెక్టర్ ప్రిన్సిపాల్ దగ్గిరకి హుటాహుటి వెళ్లటం గమనించగానే గోపీ ప్రాణాలు పైనే పోయాయి. స్నేహితుల అండదండ లున్నాయి గదా అని క్షణం ధైర్యం తెచ్చుకున్నాడు. కాని తనని దౌర్జన్యానికి ప్రోత్సహించిన ధీరులు అప్పటికే కాలేజీ ఆవరణకి వెనక వైపు గల గోడ దూకి పోవటానికి సన్నద్ధులు కావటం చూసేసరికి గోపీ గుండె బేజారెత్తింది. తనని పోలీస్ కస్టడీలోకి తీసుకోవటం ఖాయం. కస్టడీలో ఆ యమబాధ గురించి తను విన్నాడు. అదీ కాక తలెత్తుకు ఎలా తిరగ్గలడు? ఇంటికి పారిపోతే పోలీసులు తప్పక అడ్రెసు తెలుసుకొని వచ్చి లాకప్‌లోకి తీసుకుంటారు. గోపీకి ముచ్చెమటలు పోశాయి. ఇంక ముందూ వెనకా చూడకుండా పరుగు తీశాడు. వెనక వైపు ప్రహరీ గోడ దూకాడు. స్టేషన్ రోడ్ వైపు వెనక్కి చూడకుండా కాలికొద్దీ దౌడు తీశాడు. గూడ్సు యార్డ్ వైపు నించి పట్టాలు చేరుకుని బయలుదేరటానికి సిద్ధంగా ఉన్న రైలు ఎక్కి ఊపిరి పీల్చుకున్నాడు. గుండెలు దడదడలాడసాగాయి. అదృష్టవశాత్తూ అప్పుడే రైలు కూత వేసి స్టార్టయింది.

గోపీ జేబు చూసుకున్నాడు. ఒక్క రూపాయి మాత్రం ఉంది. ముందు కార్యక్రమం ఏమిటో అర్థం కాలేదు. ఏదో దూర ప్రాంతపు స్టేషన్‌లో దిగి ఏ స్నేహితుడికో ఉత్తరం వ్రాసి కొంత డబ్బు తెప్పించుకోవా లనుకున్నాడు. కాని అందువల్ల తన ఆచూకీ తెలిసిపోవచ్చు. ఇంక కాలేజీ జీవితానికి స్వస్తే నేమో? ఎంత తొందరపడ్డాడు!

"టికెట్..." టి. టి. ఇ. చెకింగ్‌కి వస్తున్నాడు. ముచ్చెమటలు పోశాయి గోపీకి. అతని కన్ను కప్పి లావేటరీలో దూరాడు. ఒక గంట ఆ దుర్గంధం భరిస్తూ గడిపాడు. ఆ తరవాత బయటికి వచ్చాడు. టి. టి. ఇ. లేడు. 'బ్రతుకుజీవుడా' అనుకున్నాడు.

సాయంకాలానికి ట్రెయిన్ విజయవాడ చేరింది. అయితే సిగ్నల్ ఇవ్వక పోవటం వల్ల ఔటర్ సిగ్నల్ పోస్టు దగ్గిర ఆగింది. విజయవాడలో ఏదో ఉపాధి దొరక్కపోదు. దిగటానికి కూడా మంచి సదుపాయం దొరికింది. గోపీ చప్పున రైలు దిగి నడక సాగించాడు. పట్నం చేరాడు. ఆకలి విపరీతంగా ఉంది. ఉన్న రూపాయి ఖర్చుపెట్టి ఫలహారం చేశాడు. స్టేషన్ చేరుకుని థర్డ్ క్లాస్ ప్రయాణికుల వెయిటింగ్ రూమ్‌లో పడుకున్నాడు. కలత నిద్ర పట్టింది.

తెల్లవారింది. సిగరెట్లు లేవు. కాఫీ లేదు. అమ్మ మేలుకొలుపు లేదు. ఇంటి దగ్గిర అమ్మా, నాన్నా ఎంత గాభరా పడుతున్నారో! కాలేజీలో విద్యార్థులు తనని గురించి ఏమనుకుంటున్నారో? పోలీసు వారు ఎ[illegible]ంటి నిఘా వేశారో! ఎలాగో ఆ లెక్చరర్‌ని కలుసుకుని క్షమించమని ప్రాధేయపడితే? కాని రైలుఛార్జీ ఏదీ? ముందు ప్రస్తుతం తిండి ఎలా గడుస్తుంది? ఇదంతా కొత్త ప్రదేశం. తనని ఎరిగినవాళ్లెవరూ లేరు. ఏ హోటల్లోనో సర్వర్‌గా చేరితే? ఇది భేషైన ఆలోచనగా తోచింది. నీళ్లు పుక్కిలించి ఉమ్మివేసి హోటళ్ల బోర్డులు వెతుక్కుంటూ ఎక్కే గడపా దిగే గడపాగా తిరిగాడు. ఎవరూ సర్వర్‌గా తీసుకోలేదు. క్లీనర్ అయినా సరే నన్నాడు. అదీ దొరకలేదు. ఆ రోజంతా ఉపవాసమే. కూలీపని చేస్తే! నామోషీ పడ్డాడు. చీకటి పడింది. ఎవరూ తనవైపు దీక్షగా చూడరు లెమ్మని రాజీపడి మార్కెట్ దగ్గిర కూలీకోసం నిలబడ్డాడు. అదీ దొరక్కపోగా అందరూ అతన్ని వింతగా చూడసాగారు. కాళ్లీడ్చుకుంటూ స్టేషన్ చేరుకుని కాలే కడుపుతో కలత నిద్రపోయాడు. మర్నాడు చేసిన ప్రయత్నం కూడా ఫలించలేదు. కడుపులో ఆకలి మండి పోతూంది.

చప్పున ఓ ఉపాయం తోచింది. ఇంగ్లీషులో అడుక్కుంటే! ఆ పథకం వెంటనే అమల్లో పెట్టాడు. "ఇదో కొత్త వేషం" అని అందరూ ఈసడించుకున్నారు. అవును, అడుక్కోవటానికి తనకి అర్హత ఏదీ? కాలూ, చెయ్యీ ఉన్న వాడు.

జేబు కొడితే?

బస్సుస్టాండ్‌కి వెళ్ళాడు. లాల్చీ జేబులు బరువుగా ఉన్న వారి వెంట అడుగులు వేయసాగాడు. మాసిన అతని దుస్తులు చూసి అనుమానంగా అతని వైపు ఇద్దరు, ముగ్గురు పరకాయించి చూశారు. బిక్కచచ్చిపోయాడు. కాని... రైలు ఛార్జీ అయినా దొరికితే ...

బస్సు ఎక్కుతున్న ఆసామీ జేబులో చెయ్యి పెట్టిన ఓ మరావా సూట్ వాలాని అప్రయత్నంగా చూసిన గోపీ క్షణం నిర్విణ్ణుడయ్యాడు. రివ్వున పరిగెత్తి అతని చెయ్యి పట్టుకున్నాడు.

"పిక్‌పాకెట్, సార్."

నలుగురూ చేరారు. దొంగని పట్టుకున్నారు. బస్సు ఎక్కబోతున్న ఆసామీ పర్సు జేబులోంచి తీసి చూసుకున్నాడు. అబ్బ, ఎన్ని నోట్లు!

"ఈ కుర్రాడు సమయానికి చూశాడు కనక సరిపోయింది. లేకపోతే ఎంత డబ్బు కొట్టేసేవాడు — దగుల్బాజీ! తన్నండి. బాదండి వెధవని."

ఆ కుర్రవాడిని కింద పడేసి ఇష్టం వచ్చినట్టు కొట్టి "పోలీస్ స్టేషన్‌కి తీసుకువెళ్లండి దొంగగాడిదని" అన్నారు జనం. ఎవరో ఒక ఆసామీ అతన్ని చెయ్యి పుచ్చుకుని లాక్కుపోయాడు.

ఇదంతా చూస్తున్న గోపీకి గుండె ఆగినంత పనయింది. ఇంకా నయం. తను దొంగతనం చేసి పట్టుబడలేదు. ఛీ! దొంగతనం కంటె చావు నయం.

పర్స్ దక్కిన ఆసామీ ఒక్క రూపాయి కూడా గోపీ చేతిలో పెట్టకుండా బస్సెక్కి వెళ్లిపోయాడు. గోపీ విషాదంగా నవ్వుకున్నాడు. తను పట్టుకోకపోతే బావుండేదేమో? పాపం, అతనెటువంటి స్థితిలో దొంగతనం చేయబోయాడో! అబ్బ, ఎలా కొట్టారు!

ఆ రోజూ ఉపోషంతోనే గడిచింది. ఆ రాత్రి అదృష్టవశాత్తూ కిళ్లీకొట్టు యజమాని ఒకడు కుళ్లిపోయిన రెండు అరటి పళ్లని పారేస్తే చప్పున అందుకుని ఆప్యాయంగా తిన్నాడు. కాని అది ఆకలిని మరింత ప్రజ్వరిల్లచేసింది. అమ్మ జ్ఞాపకానికి వచ్చింది. కళ్లలో నీళ్లు తిరిగాయి.

తెల్లవారి లేవగానే గోపీకి మరో ఉపాయం తట్టింది. కృష్ణ ఒడ్డున పాపపుణ్యాల్లో నమ్మకం కల ధర్మాత్ములు ఉంటారు. వాళ్లేమైనా చెయ్యి విదిలించవచ్చు. కాళ్లీడ్చుకుంటూ కృష్ణ ఒడ్డుకి చేరి గోపీ బారేజికి ఎగువగా వెళ్లాడు. స్త్రీ పురుషులు చాలా మంది స్నాన ఘట్టాల్లో స్నానం చేస్తున్నారు. దీనంగా చెయ్యి చాపాడు. దురదృష్టం! మిగతా అడుక్కునే వాళ్లకి తృణమో పణమో ముడుతూంది గాని గోపీకి ఏమీ దక్కలేదు. ఆశగా అందరి ముఖాల్లోకి చూస్తూ నడుస్తున్నాడు. అతని కళ్లు తటాలున మెరిశాయి.

విస్తట్లో అన్నం.

జనానికి కొంచెం దూరంగా ఎవరో నిలబడి చేతులు జోడించారు. గోపీ కళ్ళు విస్తరి మీదే ఉన్నాయి. ఎప్పుడెప్పుడు అవకాశం చిక్కుతుందా అని చూడసాగాడు.

ఆ వ్యక్తి గట్టిగా మంత్రం పఠించసాగాడు.

"నారాయణ నమస్కృత్వా... నారాయణ, నారాయణ."

ఆ తరవాత ఓసారి నమస్కారం చేసి దూరంగా జరిగాడు. అతని కాళ్లవైపే చూస్తున్న గోపీ చరాలున విస్తరి లంకించుకుని దౌడు తీశాడు.

"పట్టుకోండి, పట్టుకోండి."

కేకలు. జనం పరిగెత్తుతున్న ధ్వని.

ప్రాణానికి తెగించి పరుగుతీస్తున్నాడు గోపీ. కాళ్ళు తేలిపోతున్నాయి. కళ్లు తిరగసాగాయి. పట్టుకుంటారేమో? ఈ లోపలే కాస్తన్నా తింటే...

ఆత్రతతో ఓ ముద్ద నోట్లో వేసుకున్నాడు.

కొరబోయింది.

"ఎవరు తలుచుకుంటున్నారో చిట్టి తండ్రిని!" అని, అమ్మ అన్నట్టయి ఉలిక్కిపడ్డాడు గోపీ. అమ్మ!

"అమ్మా!" అని జాలిగా పిలిచాడు.

"నెమ్మదిగా తిను, బాబూ. తిను, మరి" అని అమ్మ అన్నట్టయింది. ముద్ద లోపలికి పోలేదు. అలాగే బలవంతాన మింగాడు.

"నా ఒకే ఒక్క కోరిక నువ్వు డాక్టరువి కావాలనే, బాబూ..." అని అమ్మ తలనిమిరినట్టయింది.

గొంతు పట్టుకుంది. దగ్గాడు. "చిరంజీవ" అని అమ్మ అన్నట్టయింది. అంతే! ఇంక మింగుడుపడలేదు.

కేకలు దగ్గర అయాయి. పిచ్చిగా పరిగెత్తాడు. ఎదురు దెబ్బ తగిలి బోర్లా పడ్డాడు.

విస్తట్లో అన్నం నేలపాలయింది. లేవలేకపోతున్నాడు.

జనం బాగా దగ్గిరగా చేరిన వప్పడి.



రవ్వలు

ఫొటో — జె. సరోజిని (తిరుపతి-2)

"వీడి దుంపతెగ! శనిలా దాపురించాడు. బతికి బావుకున్నది లేకపోయినా శ్రాద్ధమైనా దక్కుతుందనుకుంటే ఇలా అయింది. ఖర్మ. ఆ మహాతల్లి దురదృష్టం ఇంతకీ."

ఆ కంఠస్వరం సుపరిచితమే. పోల్చుకోసాగాడు గోపీ. అవును, ఆయన శాస్త్రిగారై ఉండాలి. ఎక్కడలేని బలం వచ్చింది. లేచి నిలబడ్డాడు.

"శాస్త్రిగారూ!"

ఆ వ్యక్తి అతన్ని పరకాయించి చూసి తెల్లబోయాడు.

"నువ్వా, గోపీ! చివరికి ఇలా బికారిగా తయారయావా! ఆ మహాతల్లి గోడుగోడుమని గుండె పగిలి —"

గోపీ కళ్లు తిరగసాగాయి.

"ఏమిటి? ఏమిటి, శాస్త్రిగారూ, అమ్మకి ఏమైంది? ఏమైంది? మా అమ్మ కులాసాయేనా? చెప్పండి." హీనస్వరంతో అన్నాడు.

శాస్త్రిగారి గొంతు గాద్గదికమైంది. చేతులెత్తి కృష్ణవేణమ్మకి నమస్కరించాడు.

"కృష్ణవేణమ్మలో కలిసిపోయినా కొడుకుని కనిపెట్టే ఉన్నావా, తల్లీ!" దుఃఖంతో ఆయన గొంతు పూడిపోయింది.

గోపీ చాపచుట్టగా పడిపోయాడు. విస్తరిని గట్టిగా గుండెకి అదుముకున్నాడు. శాస్త్రిగారు అతన్ని నెమ్మదిగా లేవదీస్తూంటే జనం అర్థం కాని కళ్లతో వాళ్ల వైపు చూడసాగారు. కృష్ణవేణి తల్లడిల్లిపోసాగింది. ★